

# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి



శనివారం | 21 | మార్చి | 2026 పేజీలు: 12


# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

## మంత్రి జూపల్లి



కొల్లాపూర్ మార్చి 20 (మనం న్యూస్): పవిత్ర రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ పర్యాటక, సాంస్కృతిక, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత నిష్టతో, క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు ముగించుకుని జరుపుకునే ఈ పండుగ సమాజంలో శాంతి, సౌభాతృత్వానికి ప్రతీక అని ఆయన కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు పంచిపెట్టాలనే 'జకాత్' విధి విధానం మానవత్వాన్ని చాటిచెబుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం భిన్నత్వంలో ఏకత్వానికి, గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి నిలయమని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసిమెలసి పండుగలు జరుపుకోవడం మన రాష్ట్ర విశిష్టత అని ఆయన గుర్తుచేశారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, పరమత సహనం, స్నేహభావం మరింత పటిష్టం కావాలని కోరుకుంటూ అందరికీ 'ఈద్ ముబారక్' తెలియజేశారు.

# ప్రజల సంక్షేమానికి దిశానిర్దేశం చేసే బడ్జెట్

## యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా రూపొందించబడిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వం విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని చెప్పారు. అంతేకాదు ఈ బడ్జెట్లో సామాన్య ప్రజల సంక్షేమం, యువత అభివృద్ధి, పేదల జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ఎంతో శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. తెల్ల రేషన్ కార్డుదారులకు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రవేశపెట్టడం ద్వారా ఆర్థిక భద్రత కల్పించబడుతుందని, ఇది పేద కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తుందని అన్నారు. అదేవిధంగా, ఇందిరమ్మ ఇండ్లు పథకంకు అత్యధిక శాతం నిధులు కేటాయించడం ద్వారా పేదల సొంత ఇంటి కల నెరవేరే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. యువత అభివృద్ధికి కీలకమైన రాజీవ్ యువ వికాసం పథకానికి నిధులు కేటాయించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి ప్రోత్సాహం లభిస్తాయని అన్నారు. ఈ చర్యలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కూడా దోహదపడతాయని వివరించారు. మొత్తంగా ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా ఉంది, సంక్షేమం మరియు అభివృద్ధి రెండింటినీ సమతుల్యం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా ఉందని ఆయన అభినందించారు.



2

కనిపించిన నెలవంక

# నేడే రంజాన్

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

2





# ఎస్.ఎస్.సి పరీక్షలపై కలెక్టర్ సమీక్ష

2

ఎస్.ఎస్.సి.పబ్లిక్ పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకువెళ్లేందుకు అనుమతించ రాదు :జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్, 20 మార్చి,(మనం, ప్రతినిధి ): హైదరాబాద్లోని తెలంగాణ రాష్ట్ర శాసనసభలో శుక్రవారం మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తనను ప్రభుత్వ విప్గా నియమించినందుకు ముఖ్యమంత్రి కి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానని, అసెంబ్లీలో ప్రభుత్వ విధానాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లడంలో తన వంతు పాత్రను నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అదేవిధంగా, మహబూబ్నగర్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి తో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్య రంగాల పురోగతిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కూడా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అభినందనలు తెలియజేస్తూ, ప్రభుత్వ విప్గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, శాసనసభ ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, విజయ రామారావు , వేముల వీరేశం, శాసనమండలి ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ , తదితరులు పాల్గొన్నారు

## ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అసెంబ్లీలో 3,24,234 కోట్ల బడ్జెట్ ను వివిధ శాఖలకు కేటాయించారని తెలిపారు. మూలధన వ్యయం 47,267 కోట్లు కాగా రెవెన్యూ వ్యయం 2,34,406 కోట్లు అని వివరించారు. అలాగే ఎస్సీ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు 1500 కోట్లు కేటాయించి తమ నిబద్ధతను రాష్ట్ర ప్రభుత్వం చాటుకున్నదని తెలిపారు.



# ఎస్.ఎస్.సి పరీక్షలపై కలెక్టర్ సమీక్ష

**ఎస్.ఎస్.సి.పబ్లిక్ పరీక్షా కేంద్రాల్లోకి**
**మొబైల్ ఫోన్ లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకు వెళ్లేందుకు అనుమతించ రాదు**
**:జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

మహబూబ్ నగర్, 20మర్చి, (మనం ప్రతినిధి ): జిల్లాలో జరుగుతున్న యస్.యస్.సి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని,పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్ లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతించ రాదని,పరీక్ష కేంద్రంమొబైల్ జీరో జోన్ గా మార్చేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం డిపార్ట్మెంటల్ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో వెబెక్స్ ద్వారా

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే తెలుగు, హిందీ లాంగ్వేజ్ పరీక్షలు ఎటువంటి సమస్యలు లేకుండా విజయవంతంగా నిర్వహించామని,





మిగిలిన పరీక్షలను కూడా అదే విధంగా ఎటువంటి సమస్యలకు తావు ఇవ్వకుండా, జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎటువంటి లోపాలకు,గందర గోళం కు చోటు ఇవ్వకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించే ముందు ఖచ్చితంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాలికలను మహిళా సిబ్బంది ద్వారానే తనిఖీ చేయాలనిస్పష్టంచేశారు.కాపీయింగ్,అవకతవకలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి పరీక్షా కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నాయని తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు లో ఉందని, ప్రజలు గుంపులుగా చేరడాన్ని అనుమతించరాదని చెప్పారు. ప్రతి కేంద్రంలో పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పరీక్షలు ప్రారంభం నుంచి ముగింపు వరకు చీఫ్ సూపరింటెండెంట్లు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సందేహాలు లేదా సమస్యలు వచ్చిన వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలను పంపిణీకి ముందు సరిగా పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి. ఈ .ఓ ఇన్చార్జ్ డి.పి.ఓ వెంకట్ రెడ్డి, ఏ.ఎం.ఓ డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కనిపించిన నెలవంక

# నేడే రంజాన్

ఉప్పునుంతల, మార్చి 20 (మనం న్యూస్): శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనమిచ్చిన నేపథ్యంలో నేడు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ముస్లిం సోదరులు సన్నద్ధమయ్యారు. గత 30 రోజులుగా కఠిన ఉపవాస దీక్షలు (రోజాలు) ఆచరించిన భక్తులు, పవిత్ర రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేసుకున్నారు.రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం అయిన జుమతుల్ విధా సందర్భంగా స్థానిక మసీదుల్లో ప్రత్యేక నమాజులు నిర్వహించబడినాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లాహ్కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు.సాయంత్రం నెలవంక కనిపించడంతో ముస్లిం పెద్దలు అధికారికంగా రంజాన్ పండుగను ప్రకటించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో మసీదు ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలునిర్వహించబడ్డాయి. ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఇదిలా ఉండగా, రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక



నమాజులు, దానధర్మాలు, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలునిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పండుగ రోజు ఉదయం ఈద్ నమాజ్ను పెద్దఎత్తున నిర్వహించేందుకు మసీదులు మరియు ఈద్ గాహ్లలో అన్ని ఏర్పాట్లు చేశారు.స్థానికప్రజాప్రతినిధులు, ప్రముఖులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ శాంతి, సఖ్యతకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.

# దశాబ్దపు నిరీక్షణకు తెర..
## పరాభవ నామంతో పంచాంగం పున ప్రారంభం

**గుండ్ల గుంట పల్లి సర్పంచ్ జరుపులవత్ రమేష్ నాయక్.**



ఊరుకొండ మార్చ్20 (మనం న్యూస్): స్థానిక మండల పరిధిలోని గుండ్లగుంటపల్లి గ్రామపంచాయతీలో ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగం పున ప్రారంభం కావడంతో ఊరుకొండ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు జరపులవత్ రమేష్ నాయక్ సంభాషిస్తూ, దశబ్ద కాలం క్రితం గ్రామంలో పంచాంగ శ్రావణం జరిపించడం జరిగింది.కాలక్రమమైన మారుమూల ప్రాంతం కావడంతో పండితులు రాకపోవడం వల్ల గ్రామంలో పంచాంగం ఆగిపోయేది,శ్రీ పరాభవ ఉగాది నామ సంవత్సరం సందర్భంగా గ్రామంలో పంచాంగం పున ప్రారంభం కావడంతో గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఉగాది అంటే, 'యుగానికి ఆది అని అర్థం' అంటే కొత్త కాలం కొత్త ప్రారంభం ప్రకృతిలో మార్పును కాలగమనంలో వచ్చే కొత్త సంవత్సరానికి తెలుగు వారు ఆహ్వానించే అతిపెద్ద పండుగ ఉగాది అని స్థానిక పండితుడు ప్రశంస చేశారు.తెలుగు నూతన సంవత్సర వేడుకలు ఒక ప్రత్యేక విశిష్టతతో పున ప్రారంభమవుతున్నాయని,ఇది కేవలం పండుగ మాత్రమే కాదు కొత్త ప్రారంభ సంప్రదాయాల పునర్ధరణ,ప్రకృతి సిద్ధంగా, వ్యవసాయపరంగా జ్యోతిష్యపరంగా, అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న సంవత్సరం కొంతకాలంగా పంచాంగ శ్రవణం ఉగాది సంప్రదాయ నిర్వహణలో తగ్గిన ఉత్సాహం ఏడాది సరికొత్తగా,గ్రామకూ డళ్ళలో ఆలయంలో ఘనంగా పునః ప్రారంభం అవుతుంది.దశాబ్ద కాలం తర్వాత మళ్ళీ తిరిగి వారి సంప్రదాయం పంచాంగ శ్రవణం యొక్క ప్రాముఖ్యత ఉన్న ప్రారంభం కావటం, శుభపరిణామం.శ్రీ పరాభవ నామ సంవత్సరంలో మనలోని అహంకారాన్ని పరాభావం చేసి (ఓడించి)కొత్త ఉత్సాహంతో తెలుగు సంస్కృతిని కాపాడుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తూ ముందుకు సాగాలని సూచన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్, కర్నాటి బుచ్చయ్య గౌడ్ బాలకృష్ణ గౌడ్ వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొనడం జరిగింది.



## హైడ్రాలిక్ లిఫ్ట్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ



మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ): మహబూబ్నగర్ జిల్లా మోటార్ ట్రాన్స్పోర్ట్ పూల్ నందు హైడ్రాలిక్ లిఫ్ట్ (లాంచ్) స్థాపన కోసం షెడ్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి. జానకి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో వాహనాల నిర్వహణ అత్యంత కీలకమని తెలిపారు. హైడ్రాలిక్ లిఫ్ట్ (లాంచ్) ఏర్పాటు ద్వారా వాహనాలకు ఆయిల్ మార్పిడి, వాషింగ్ మరియు మరమ్మత్తులు సులభంగా, వేగంగా చేయుటకు వీలవుతుందని చెప్పారు. దీని వల్ల వాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, ఫీల్ డ్యూటీలకు వాహనాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండేలా చేయవచ్చని వివరించారు. అలాగే, పోలీస్ శాఖలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా సేవలను మరింత మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సిబ్బంది అందరూ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్టను నిలబెట్టాలని సూచించారు.ఈ పూజా కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ బీ .రత్నం, ఏఅర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీస్పీ డీసీఆర్ బి రమణా రెడ్డి, వర్టికల్ డీస్పీ బాలాజీ, ఎం టి ఓ నగేష్,ఆర్ ఐ అడ్మిన్ కృష్ణయ్య, అశోక్ కుమార్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ దుగ్గి విశ్వనాథం సేవలు మరువలేము

**- సిపిఐ జిల్లా సమితి నాయకులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు**
**- చారకొండ లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో**

చారకొండ,మార్చి20(మనం న్యూస్): చారకొండ మాజీ సర్పంచ్ కామ్రేడ్ దుగ్గి విశ్వనాథం జయంతి వేడుకలు చారకొండ మండల కేంద్రంలో దుగ్గి విశ్వనాథం స్మారక స్తూపం వద్ద శుక్రవారం సిపిఐ పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ చిలువేరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వారి కుటుంబ సభ్యులు దుగ్గి అనిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మాజీ సర్పంచ్ చారకొండ గ్రామానికి సేవలు అందించారని వారి సేవలను మరవలేమని,వారు చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో నాయకులు సిపిఐ పార్టీ మండల అధ్యక్షుడు యాసారం అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్,నాయకులు కందికంటి శీను,కామ్రేడ్ డాక్టర్ సత్యం,జెల్ల బాలయ్య,కలగొని నారయ్య,కాంగ్రెస్ మండల విద్యార్థి సంఘం నాయకులు గోరటి శివ, బూత్ పూరి శంకరయ్య,గుండె ముత్యాలు,బ్రహ్మం, పగడాల లెనిన్ దితరులు పాల్గొన్నారు.



## నేడు సిరసనగండ్ల దేవస్థానంకు మంత్రి జూపల్లి కృష్ణారావు రాక

**- 2 కోట్ల తో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



చారకొండ,మార్చి20(మనం న్యూస్): చారకొండ మండలం సిరసనగండ్ల గ్రామపంచాయతీ అయోధ్య నగర్(గుట్ట) శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కొరకు 2కోట్ల తో చేపడుతున్న పాలు కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న ఎక్సైజ్,పర్యాటక, సంస్కృతిక, పునరావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.నేడు 21 మార్చి శనివారం ఉదయం 7:30గంటలకు రానున్నారు.వారితోపాటు ముఖ్య అతిథులు పిసిసి ఉపాధ్యక్షులు,నాగర్ కర్నూల్ డిసిసి అధ్యక్షుడు,అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,విశిష్ట అతిథి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి లు వస్తున్నారు.కనుక అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని,అదేవిధంగా మండలంలోని గ్రామాల సర్పంచ్ లు,మండల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని చారకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జమ్మి కింది బాలరాం గౌడ్ ప్రకటనలో తెలిపారు.

## నూతన భవనాల్లోకి తహసిల్దార్ కార్యాలయాలను తరలించాలి

**-నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ సురభి**



వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) ఉమ్మడి గోపాల్పేట మండలంలోని రేవల్లి, ఏదుల మండల కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన తహసిల్దార్ భవనాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం సందర్శించి త్వరలోనే కార్యాలయాలు షిఫ్ట్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు అందేలా నూతన కార్యాలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో ఏదుల తహసిల్దార్ మల్లికార్జున్, రేవల్లి తహసిల్దార్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా కోళ్ల వెంకటేష్

వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) దళిత ఉద్యమ నేత, విద్యావంతుడు అందరితో కలిసిపోయే మనస్తత్వం కలిగిన కోళ్ల వెంకటేష్ కు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అవకాశం దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పోరాటాల యోధుడు మందకృష్ణ మాదిగ కుడి భుజంగా ఆయన దాదాపు రెండున్నర దశాబ్దాలు సుదీర్ఘ కాలంగా పనిచేసి రాజకీయాల వైపు మొగ్గు చూపారు. గతంలో బిఆర్ఎస్ లో కొంతకాలం పనిచేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఎలాంటి పదవులకు నోచుకోలేదు. ఆ తర్వాత రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనకు అనతి కాలంలోనే జిల్లా అధికార ప్రతినిధిగా అవకాశం దక్కడం హర్షనీయం. ఈ సందర్భంగా కోళ్ల వెంకటేష్ కు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించడం పట్ల ఆయన అభిమానులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు శుభాభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.



# కంటి వెలుగులు పంచుతున్న తెలుగు సేవామూర్తి ఇందుర్తి బాలకృష్ణారెడ్డి

**అట్లాంటా దేశంలో తెలంగాణ వాసి సేవలకు అంతర్జాతీయ గౌరవ పురస్కారం....**
**న్యూజెర్సీలో ఘన సత్కారం పొందిన తెలంగాణ తెలుగు బిడ్డ....**



ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 20 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండి చింతపల్లి గ్రామానికి చెందిన ఇందుర్తి బాలకిష్ట రెడ్డి అమెరికాలో ప్రముఖ సామాజిక సేవకుడిగా గుర్తింపు పొందుతూ, సేవా కార్యక్రమాలో చురుకైన పాత్ర పోషిస్తూ, మరోసారి అంతర్జాతీయ వేదికపై ప్రశంసలు అందుకున్నారు. జేఎన్టీయూ హైదరాబాద్లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, టెక్సాస్లో కంప్యూటర్ సైన్స్ మాస్టర్స్ చేసిన ఇందుర్తి బాలకిష్ట రెడ్డి 1992లో అట్లాంటాలో స్థిరపడడం జరిగింది. 2004 నుంచి భారతీయ సమాజానికి విశేష సేవ కార్యక్రమాలు అందిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా దేశంలో (తామ), ఆప్నా ఫౌండేషన్, శంకర నేత్రాలయ యు.ఎస్.ఎ సంస్థలకు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ సేవా కార్యక్రమాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి నిధుల సేకరణలో ఆయన చేసిన కృషికి గాను శంకర రత్న పురస్కారం అందుకోవడం గర్వకారణము చెప్పుకోవచ్చు. 2016లో మొదటిసారిగా శంకర నేత్రాలయ సంస్థలో ట్రస్టీగా చేరిన బాలకృష్ణారెడ్డి, 2018లో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంస్థను 7 నుంచి 29 శాఖలకు విస్తరించడంలో ముందుండారు. 2025లో ఆయన ఆధ్వర్యంలో సుమారు 2 మిలియన్ డాలర్ల నిధులు సమీకరించడం ఆయన సేవా తపనకు నిదర్శనమని పలువురు కొనియాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య సేవలను అందించేందుకు మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ (మెసు) కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్, పుట్టపర్తి, ఎట్టయపురం ప్రాంతాల్లో ముందుగా మూడు యూనిట్లను ఏర్పాటు చేయించడం ద్వారా వేలాది మందికి కంటి చూపు వెలుగులు నింపుతున్నారు. ఇటీవల న్యూజెర్సీ రాష్ట్రంలోని ఎడిసన్ పట్టణంలో ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు ఘనంగా సత్కరించాయి. తెలంగాణ ప్రభుత్వంలో ప్రముఖ అధికారి గణపతి రెడ్డి తమ్ముళ్లలో చిన్నవారైన బాలకిష్ట రెడ్డి ఇందుర్తి తన విజయాలకు కుటుంబ సభ్యులు, సహచరులు, వాలంటీర్ల సహకారమే ప్రధాన కారణమని వినమ్రంగా తెలిపారు. గ్రామీణ నేల నుంచి గ్లోబల్ స్థాయికి ఎదిగి, సేవతో సమాజానికి వెలుగునిస్తున్న ఇందుర్తి బాలకిష్ట రెడ్డి నిజంగా యువతకు స్ఫూర్తి ప్రతీకగా నిలుస్తున్నారు. తెలంగాణ గర్వకారణంగా నిలిచిన ఈ సేవామూర్తికి రోజూరోజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో కంటి వెలుగులు ఇంకెందుకు తను సేవా కార్యక్రమాల్లో ముందుంటానని తెలిపారు.



## రంజాన్ బందోబస్తు ఏర్పాట్లపై అదనపు ఎస్పీ పరిశీలన

మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ): మహబూబ్నగర్ పట్టణంలోని ఇద్గా వక్ఫ్-ఎ-రహ్మానియా వద్ద అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించబడనున్న ఈద్ ఉల్ ఫితర్ నమాజ్కు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా మరియు ట్రాఫిక్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి మరియు ఇతర సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఇద్గా పరిసర ప్రాంతాలలో కట్టుదిట్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ నిర్వహణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో ఉగాది పర్వదినం వేడుకలు

ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 20 (మనం బ్యూరో): అచ్చంపేట పట్టణంలోని గురువారం పరాభవ నామ సంవత్సరా ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శివునికి పంచామృతాలతో అ గుభిషేకం చేయడం జరిగింది. గణపతి, శివుడు, లలిత త్రిపుర సుందరి దేవి మాతలకు నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం పంచాంగ శ్రావణం కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు చిదంబర శర్మ భక్తుల రాశి ఫలాలు చదివి వినిపించారు. తర్వాత భక్తులకు ఉగాది పచ్చడి వితరణ చేశారు. ఈ



కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి పులిజాల రమేష్ , కోశాధికారి దాసు శ్రీనివాసులు, పులిజాల యాదగిరి, మ్యాకల సత్యనారాయణ, మహిళ సంఘం అధ్యక్షులు దాసపత్రి శకుంతల, ఆలయ అధ్యక్షులు వనం పర్వతాలు, మల్లికార్జున్, రమేష్, సైదులు, రాజు, సాయిబాబు, శ్రీనివాసులు, శేఖర్, రవి కుమార్, మహేష్ లు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న-కాంగ్రెస్ నాయకుడు

**జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి.**

ఊరుకొండ మార్చ్ 20 (మనం న్యూస్): స్థానిక మండల పరిధిలోని మండల కేంద్రంలోని శుక్రవారం బోయ బక్కయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఇట్టి విషాద ఘటన స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం 5 వేల రూపాయల అందించడం. 'ఆపదలో అభయం కాంగ్రెస్ కార్యకర్తకు నిర్భయా' ' అనే



నినాదంతో పార్టీలతో సంబంధం లేకుండా నిస్వార్థంగా సహాయం అందిస్తున్న నాయకుడు అంటూ మండల ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. చనిపోయిన కుటుంబానికి మనోధైర్యాన్ని కలిగిస్తూ ఏ రాజకీయ పార్టీకైనా పునాది ఆ రాజకీయ పార్టీ 'కార్యకర్తలే'. పదవుల కోసం,కాకుండా సిద్ధాంతం కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తకు ఆపదలో ఉన్నప్పుడు మాత్రమే నాయకత్వానికి అండగా ప్రజలు నిలుస్తారని తెలియపరిచారు.స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి స్ఫూర్తితో కొనసాగుతూ,కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తను ఒక కుటుంబ సభ్యుడిగా చూసే సాంప్రదాయం ఆనాటి నుండి నేటికీ కొనసాగుతూ ఉంది. కాంగ్రెస్ పార్టీ కీలక బాధ్యతల్లో ఉండి కూడా సామాన్య కార్యకర్త విషాదాన్ని గుర్తించి కుటుంబానికి తోడ్పాటు అందించే విధంగా ఉండడం,ఆయన సేవకి నిదర్శనానికి, నిరాడంబరతకు అద్దం పట్టే విధంగా ఉందంటూ, స్థానిక మండల ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.ఆపద సమయంలో 'మేమున్నాం' అన్ని ఇచ్చే ఒక భరోసా 'వెయ్యి' ఏనుగుల బలాన్ని చేకూర్చిందని ఆకాంక్షించారు.కుటుంబ సభ్యులు ఇలాంటి ఘటనలు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల్లో అకస్మాత్తుగా కనిపిస్తే మానవీయ కోణం పట్ల ఆలోచన చేయాలని, కుటుంబానికి మనో ధైర్యాన్ని కల్పించాలని మరో మారు పునరుద్ఘాటించారు.ఈ సహాయం కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ ఎండి ఆరిఫ్,మాజీ ఉపసర్పంచ్,కంఠం యాదయ్య,కాంగ్రెస్ యువ నాయకులు బండి భాస్కర్,కంఠం వెంకటేష్, మాదారం ప్రేమయ్య, ఆలకుంట సత్తయ్య,టి ఏ ఆర్,యువసేన సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది..

## క్రికెట్ విజేతలకు నగదు, షీల్డ్‌లు అందజేత

**-మణిగిల్ల విజేతలకు 40 వేలు,**
**చిమన గుంటపల్లి గ్రామ విజేతలకు 25 వేల నగదు అందజేత.**

వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించి స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడా పోటీల్లో వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొనగా శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీలలో పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచి 40 వేల నగదు షీల్ అందుకున్నారు. అలాగే చిమనగుంటపల్లి గ్రామ క్రీడాకారులు రన్నర్ గా నిలిచి 25 వేల నగదు తో పాటు షీల్ అందుకున్నారు. బహుమతుల ప్రధాన కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మాజీ జెడ్పి చైర్మన్ లోక్నాథ్ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ లు




హాజరై నగదు తో పాటు షీల్ లు అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున ఎత్తం చరణ్ సురేష్ గౌడ్ పెద్ద కోటయ్య పాండురావు బాలచంద్ర రఘు, సిరివాడి సురేష్ రాంజీ నాయక్ శివకుమార్ చంద్రకాంత్ భాస్కర్ లక్ష్మయ్య సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజా తదితరులు పాల్గొన్నారు.

# సన్మార్గానికి భక్తి సంకీర్తనలే మార్గం

**- వనపర్తిలో ఉగాది వేడుకలు..**
**-భజన కళాకారులకు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి సత్కారం.**



వనపర్తి, మార్చి 20 ( మనం న్యూస్ ): ఉగాది పర్వదినం సందర్భంగా వనపర్తిలో భక్తి సౌరభాలు విరజిమ్మాయి. భక్తి భజన సంకీర్తనల మాధుర్యంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మనిషిని సన్మార్గంలో నడిపించే శక్తి భక్తి భజన సంకీర్తనలకే సాధ్యమని మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

శుక్రవారం వనపర్తి సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తి భజన సంకీర్తనాపరులను విశేషంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భక్తికి అపారమైన ప్రాధాన్యం ఉందన్నారు. పురాతన కాలం నుంచి సంకీర్తనల ద్వారా ధార్మికత, నీతి, నైతిక విలువలు సమాజంలో బలపడుతున్నాయని చెప్పారు.

అన్నమయ్య, రామదాసు వంటి మహానుభావులు భక్తి మార్గాన్ని ప్రజలకు చేరవేసి సమాజాన్ని సన్మార్గంలో నడిపించారని ఆయన గుర్తుచేశారు. వారి స్ఫూర్తితో నేటికీ భజనపరులు గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగిస్తున్నారని ప్రశంసించారు. భక్తి భజనల ద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుందని, కుటుంబాల్లో ఐక్యత, సమాజంలో సానుకూలత పెరుగుతుందని అన్నారు. పెబ్బేరు, కంచిరావుపల్లి, తాటిపాముల, వెంకటాపూర్, జానంపేట, కంబాలాపురం తదితర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 50 మంది భజన కళాకారులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి, నూతన సంవత్సర పంచాంగాలను బహూకరించి ఘనంగా సత్కరించారు. కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు సభలో భక్తిరసాన్ని మరింత పెంచాయి. సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ భక్తి సంప్రదాయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భజన సంకీర్తనలు యువతలో సాంస్కృతిక విలువలను పెంపొందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరోజు చంద్రశేఖర్, జిల్లా రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్. ఉమామహేశ్వర్, కరేస్వామి, వనం రాములు, నందిమల్ల అశోక్, కరుణశ్రీ, దిలీప్ రెడ్డి, సితార వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అంతా భక్తి భావంతో నిండిపోయి ఉగాది వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# ముస్లింలకు రంజాన్ భాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్, 20 మార్చి, (మనం ప్రతినిధి ): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ డి.జానకి ముస్లిం లందరికీ హృదయపూర్వక రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం నింపాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం ముస్లిం లకు ఎంతో పవిత్రమైనది. ఉపవాస దీక్షల ద్వారా సాధించే ఆత్మశుద్ధి, సహనం, సేవాభావం సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఈ పవిత్ర సందర్భంగా ప్రతి ఇంట్లో సంతోషం, శాంతి నెలకొనాలని కోరుకుంటున్నాను. పరస్పర గౌరవం, ఐక్యతతో పండుగను జరుపుకోవాలిఅని పేర్కొన్నారు.

అదేవిధంగా, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత మరియు ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి, నియమ నిబంధనలు పాటిస్తూ పండుగను సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయానికి భారీ కేటాయింపులు చారిత్రాత్మకం

**-జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి.**

వనపర్తి, మార్చి 20 (మనం న్యూస్ ): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరులకు ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజుగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,525 కోట్లు కేటాయించడం ద్వారా ఇది పూర్తిగా రైతు ప్రభుత్వం అని స్పష్టమవుతోందన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగుభూమిని విస్తరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లాల్లోని పంట పొలాలకు సాగునీరు అందే అవకాశాలు పెరిగాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పాలమూరు-రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్సాగర్, డిండి, గూడెం దొడ్డి, గట్టు ఎత్తిపోతల వంటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ చర్యలతో రైతులకు సాగునీటి సమస్యలు తగ్గి పంటల ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వనపర్తి కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి కిసాన్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, గణపురం కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా బ్రహ్మయ్య చారి



వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన మాజీ కౌన్సిలర్ బ్రహ్మయ్య చారికి జిల్లా కాంగ్రెస్ పార్టీలో అరుదైన అవకాశం లభించింది. ఉగాది పండగను పురస్కరించుకొని గురువారం వనపర్తి డిసిసి పూర్తిస్థాయి కమిటీని రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా జిల్లా జనరల్ సెక్రటరీగా బ్రహ్మయ్య చారితో పాటు 21వ వార్డు కౌన్సిలర్ పి. ధనలక్ష్మి, ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఎల్. సతీష్ కుమార్, దేవరకద్ర ఎమ్మెల్యే కు సన్నిహితుడుగా ఉండే పాపయ్య గారి కృష్ణారెడ్డి, తాడిపర్తి మాజీ సర్పంచ్, గోపాల్పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్రాతి గణేష్ గౌడ్, పెద్దమందడి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఇటికెల సత్యారెడ్డి లు నియమితులయ్యారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**- మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు**



చారకొండ, మార్చి 20 (మనం న్యూస్): రంజాన్ పర్వదినం సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ ముస్లిం సోదరులకు,చారకొండ మండల ప్రజలకు,వెల్దండ మాజీ సింగిల్ విండో చైర్మన్ బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు రంజాన్ పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ ఈద్ ముబారక్

**- కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్-ముజ్జు బాయ్**



చారకొండ, మార్చి20(మనం న్యూస్): చారకొండ మండలంలో నాతోటి ముస్లిం సోదరులకు నాగర్ కర్నూలు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్.కె ముస్తఫా ముజ్జు బాయ్ రంజాన్ పర్వదినం శనివారం సందర్భంగా ఈద్ ముబారక్ తెలియజేశారు.సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పర్వదిన సందర్భంగా మండలంలోని ముస్లిం సోదరులందరికీ రంజాన్ ఈద్ ముబారక్ తెలియజేశారు.గత 30 రోజుల నుండి ఉపవాస దీక్షలో ఉన్న నా సోదరీ సోదరీమణులకు ధన్యవాదాలు ప్రకటనలో తెలిపారు.

# దేవరకద్ర మున్సిపాలిటీ మేనేజర్‌కు షోకాజ్ నోటీస్ జారీ

**దేవరకద్ర పట్టణం లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



మహబూబ్ నగర్, 20మార్చి,( మనం ప్రతినిధి ): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ఫోటోలు దశల వారీగా ఆప్ లో క్యాప్చర్ చేయడం లో నిర్లక్ష్యం వహించిన దేవరకద్ర మున్సిపాలిటీ మేనేజర్,ఏడవ వార్డ్ అధికారికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.శుక్రవారం దేవర కద్ర పట్టణం లో 7 వార్డ్ లో ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.7 వార్డ్ లో నిర్మాణం పూర్తి అయిన ఉన్న ఇండ్లకు నాల్గవ విడత డబ్బులు రాలేదని లబ్ధిదారులు తెలిపారు.సంబంధిత వార్డ్ ఆఫీసర్ టెక్నికల్ సమస్య ఉందని మున్సిపల్ కమిషనర్ ను తప్పు దోవ పట్టించి అప్లోడ్ చేయడం లో సుమారు నెల రోజుల నుండి జాప్యం చేయడం కలెక్టర్ గమనించారు.అదే విధంగా ఆప్ లో టెక్నికల్ సమస్య లేదని కలెక్టర్ స్వయంగా పరిశీలించి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం దశల వారీగా ఫోటో లు ఆప్ లో క్యాప్చర్ చేయడం లో జాప్యం చేయవద్దని,ఒక వేళ ఫోటో లు క్యాప్చర్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు,మున్సిపల్ వార్డ్ అధికారుల పై క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. పట్టణం లో 67 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. మంజూరైన ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, మున్సిపల్ పరిధిలో వార్డ్ నెంబర్ 7 లో నిర్మాణం పూర్తయిన శిరీష, నర్సమ్మ , లక్ష్మమ్మ లబ్ధి దారుల ఇళ్లను సందర్శించి వారితో మాట్లాడారు. ఇంటి నిర్మాణం ఎప్పుడు మొదలు పెట్టారు? నిర్మాణానికి ఎంత వ్యయం చేశారు? బిల్లులు సమయానికి అందుతున్నాయా? అనే విషయాలను కలెక్టర్ ఆరా తీశారు లబ్ధిదారులు మాట్లాడుతూ ఇప్పటివరకు 3,40,000 రూ. లు వచ్చినట్లు తెలిపారు.లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం పూర్తి అయి గృహ ప్రవేశం చేసుకున్నారు. చివరి దశ బిల్లు ఇంకా పెండింగ్లో ఉందని కలెక్టర్ కు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే ఫోటో లు అప్లోడ్ చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు,ఎం.పి.డి.ఓ శ్రీనివాస రావు లు ఉన్నారు





## స్నేహం,ఐక్యత,సోదర భావానికి ప్రతీక రంజాన్ పండుగ

**కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్...**

**నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ...**

కల్వకుర్తి మార్చి20(మనం న్యూస్): ముస్లీం సోదరులు నెల రోజుల పాటు అత్యంత నిష్టతో,క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు ముగించుకుని జరుపుకునే రంజాన్ పండుగ సమాజంలో శాంతి,సౌభాతృత్వానికి ప్రతీక అని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రంజాన్ కిట్లను శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,ఆర్డీఓ ఎంపీ జనార్ధన్ రెడ్డి,లు నిరుపేద ముస్లీంలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం మైనార్టీల సంక్షేమ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తుందని అన్నారు.ముస్లీం సోదర సోదరీమణులందరికీ అల్లాహ్ దీవెనలు కలగాలని రంజాన్ పండుగను ప్రతిఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.రంజాన్ పండుగ మతసామరస్యానికి,సమైక్యతకు ప్రతీకగా నిలవాలని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ ఏజాస్, మబ్బు రామరాజు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సయ్యద్ మసూద్, రమాకాంత్ రెడ్డి,మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తారి శ్రీనివాసులు,సోఫీ, అజీమ్,యాహియఖాన్, ముక్తాధర్,ఆరిఫ్,అఖిల్, ఖాజ,లతో పాటు వివిధ మస్జిద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల పన్నుల వసూళ్లు

వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా శుక్రవారం మునిసిపల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఆస్తి పన్ను, లైసెన్స్ ఫీజు, నీటి పన్ను వసూలు చేశారు. అలాగే మునిసిపల్ చైర్మన్ మాధవి రమేష్ తో పాటు కమిషనర్ వెంకటేశ్వర్లు, డిఈఈ, వార్డు ఆఫీసర్స్, మునిసిపల్ సిబ్బంది కలిసి డంపింగ్ యార్డ్, కంపోస్ట్ యూనిట్ ను పరిశీలించి 2026-27 సంవత్సరం బడ్జెట్ పై చర్చించారు.







## రాములవారి బ్రహ్మోత్సవాలకు గట్టి బందోబస్తు

**- జాతర ఏర్పాట్లు పరిశీలన సీఐ రఘువీర్ రెడ్డి**

చారకొండ,మార్చి20(మనం న్యూస్): శిరసానగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు.చారకొండ మండల పరిధిలోని శ్రీ సిరసనగండ్ల గ్రామం అయోధ్య నగర్ గుట్టపై వెలసిన అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని శుక్రవారం సిఐ రఘువీర్ రెడ్డి,స్థానిక ఎస్సై పి వీరబాబు లు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా వీఐపీల రాక,భక్తులకు అనుగుణంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాటు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల మార్చి 26 నుండి ఏప్రిల్ 07 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి భద్రతాపరంగా అన్ని ఏర్పాట్లు చేస్తామన అన్నారు.ట్రాఫిక్ నిబంధనలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేస్తామని,రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేపడుతామని ఆయన అన్నారు.ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక దృష్టి సాధిస్తామని సీసీ కెమెరాల ద్వారా పోలీసు నిఘ ఉంచుతామని సూచించారు.ఈ కార్యక్రమంలో వెల్దండ ఎస్సై కురుమూర్తి,చారకొండ పోలీస్ సిబ్బంది, మండల నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి గుండె వెంకట్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకలి గణేష్ గౌడ్,సర్పంచ్ కామెళ్ళ రామస్వామి,ఉప సర్పంచ్ కళ్ళ సురేందర్ రెడ్డి,ఆలయ చైర్మన్ రాము శర్మ,ఈవో స్వర్గం ఆంజనేయులు,ప్రధాన అర్చకుడు లక్ష్మణ్ శర్మ, అర్చకులు వేణు శర్మ,గోపి శర్మ,ఆనంద్ శర్మ,గ్రామ ప్రజలు వివిధ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీరని అన్యాయం

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్.**

కొల్లాపూర్ మార్చి 20 (మనం న్యూస్): కొల్లాపూర్ మండల కేంద్రంలో ఎన్టీఆర్ చౌరస్తాలో రాష్ట్ర బడ్జెట్ పత్రాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం తారా సింగ్ మాట్లాడుతూ విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చెప్పేదొకటి చేసేది ఒకటి కనీసం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కానీ బడ్జెట్లో 100 కోట్లు రెనోవేషన్ కోసం కేటాయింపు చేశారు. ఈ 100 కోట్లతో హస్టళ్లు ఎలా బాగుపడతాయని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురుకుల అద్దె భవనాలు, కెజిబివిలు అదనపు బిల్డింగ్ లు , సంక్షేమ వసతిగృహాల మౌళిక సదుపాయాలు లేవన్నారు. అలాగే గతం కంటే మొత్తం బడ్జెట్ పెరిగినప్పుడు విద్య రంగానికి కూడా బడ్జెట్ పెంచాలని గత బడ్జెట్ కు ఈ బడ్జెట్ కు పెంచినట్లు కనిపించింది కానీ విద్యకు తీవ్ర మెండిచెయ్యి చుపారనిఆయన అన్నారు.

ఇంటర్ విద్యార్థులు మధ్యాహ్నం భోజనం., 118 ఎసిటి(ఐటిటి )విద్యార్థులకు నెలకు 2000/- స్కాలర్ షిప్స్ సాయం,బాగానే ఉన్నా ఆచరణలో అమలు చేయాలని అన్నారు. కాబట్టి తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో కనీసం 30% నిధుల కేటాయింపులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల తక్షణ చెల్లింపులు చేయాలని, ప్రభుత్వ యూనివర్సిటీలకు తక్షణ నిధుల విడుదల చేసి, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, రామకృష్ణ, సంజు, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# చెన్నయ్య గుట్టపై ఆధ్యాత్మికత నిట్ట

# వెల్లి విరిసిన భక్తి పరవశపు మెట్టు

**భాజపా రాష్ట్ర మహిళా నేత బాల త్రిపుర సుందరి.**
**గుట్టపై కొలువుదీరిన చెన్నయ్య భక్తులను సల్లంగా చూడవయ్యా**
**నాగర్ కర్నూల్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు వాగుల్దాస్ నిరంజన్ గౌడ్**



ఊరుకొండ మార్చి 20 (మనం న్యూస్): ఊరుకొండ మండల పరిధిలోని శుక్రవారం బొమ్మరాజు పల్లి గ్రామంలో ప్రతి ఏట నిర్వహించే ఉగాది పర్వదినం పునఃస్కరించుకొని శ్రీశ్రీశ్రీ చెన్నయ్య గుట్ట బ్రహ్మోత్సవాలు తాడెం చిన్న ఆధ్వర్యంలో కన్నుల పండగల కమనీయంగా నిర్వహించుకున్నా సందర్భంలో రాష్ట్ర భాజపా మహిళ నేత బాలా త్రిపుర సుందరి ప్రత్యేక ఆహ్వానితుల పాల్గొని ముచ్చటిస్తున్న సందర్భంగా,పౌరాణిక,చారిత్రక,ప్రశస్తం ఉన్న పుణ్యక్షేత్రాలలో బొమ్మరాజుపల్లి ఒకటని,ప్రకృతి ఒడిలో పరవశించే ఈ క్షేత్రం భక్తుల పాలిట కల్పవల్లిగా నేటి వరకు ఆధ్యాత్మిక క్షేత్రంగా విరజిల్లుతుందని కొనియాడారు.చెన్నయ్య గుట్టపై ప్రతి ఏట నిర్వహించే బ్రహ్మోత్సవాలలో దైవాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం,ఈ క్షేత్ర ప్రాముఖ్యతను ఇక్కడ నెలకొన్న ప్రశాంత వాతావరణ పరిస్థితుల్ని ప్రత్యక్షంగా వీక్షించి, తిలకించి,భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని చెన్నయ్య గుట్టపై మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఇంతటి ఆధ్యాత్మిక క్షేత్రం నేడు నిరాదరణ, నిర్లక్ష్యానికి,గురైందని,ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది.ఒక మారుమూల గ్రామానికి పరిమితమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఆమె ఆకాంక్షిస్తూ,ఇలాంటి పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు తప్పకుండా తోడ్పాటు అందించి పుణ్యక్షేతాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలని తద్వారా భక్తి పరవశంతో వెల్లి విరుస్తాయని,భక్తుల కోరికలు తీర్చే మహోన్నత క్షేత్రంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ మహిళా చూపిన చొరవ క్షేత్ర ప్రగతికి ఒక శుభారంభమని గ్రామస్తులు అభినందించడం జరిగింది.

ఈ నేపథ్యంలో నాగర్కర్నూల్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు వాగుల్దాస్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ, రాజకీయాల కతీతంగా, ఆధ్యాత్మికతను గౌరవించే సంస్కృతి ప్రత్యేకంగా భాజపా పార్టీదని,చెన్నయ్య గుట్ట,క్షేత్ర వైభవాన్ని ఈ ప్రాంత ప్రజలలో భక్తులతో నూతన ఉత్తేజాన్ని, ఆధ్యాత్మికతను వెల్లివిరుస్తుందని,ఈ క్షేత్రం మున్ముందు దివ్య ధామంగా మారి,వెలుగులు పంచాలని,భక్తులతో సంభాషించారు. రాజకీయ బాధ్యత తో తీరిక లేకుండా గడిపే జిల్లా,రాష్ట్ర నేతలంతా తమ మూలాలు మరవకుండా ఇలాంటి పుణ్యక్షేత్రాలను సందర్శించడం విశేషం అంటూ అభినందించడం జరిగింది.ఆలయ ప్రాంగణంలో పవిత్రతను కాపాడాలని పూజలు భక్తులతో,దైవచింతన స్వామి పై ఉన్న మక్కువను చాటుకున్నారని, చెన్నయ్య గుట్ట ప్రకృతి ఒడిలో వెలిసిన,ఒక అపురూపమైన క్షేత్రం అని,ప్రశాంతమైన వాతావరణం చుట్టుకొలవై ఉన్న ప్రకృతి అందాల నడుమ,వ్యవసాయ పొలాలకు సమీపంలో ఉన్న,ఈ చెన్నయ్య గుట్ట కేవలం పర్యటన ఒక రాజకీయ క్రమంలో కాకుండా,ప్రజలతో ఆధ్యాత్మికత,అనుసంధానమయ్యే వేదికగా నిలిచిందని చెప్పడంలో అతి యో శక్తి లేదని,ప్రజా సమస్యలు,ప్రజల కోరికలు చెన్నయ్య గుట్టపై వెలసిన దర్శనానికి వెళ్తే పరిష్కారం అవుతాయని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.కోరుకున్న కోరికలు సఫలం కావాలని విశ్వసిస్తారు.ఈ దివ్య క్షేత్రంలో స్థానిక సర్పంచ్ చెరుకు తిరుపతమ్మ,ఉప సర్పంచ్ బోయ తిరుపతయ్య,రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు మణికంఠ,కల్వకుర్తి బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్, భాజపా సీనియర్ నాయకుడు బక్క మన్యం,బుడుమ జంగన్న,వాగుల్దాస్ చింటు,ఆరంపల్లి సత్యనారాయణ యాదవ్,మండ్ల శివ, ఆంజనేయులు,మురుగని సాయి,జోలం శ్రీకాంత్,మండ్ల శ్రీకాంత్,హరి, కుమార్,తాడెం నాగరాజు,గ్రామ పెద్దలు వివిధ పార్టీలకు చెందిన నాయకులు,భక్తులు,వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొనడం జరిగింది.



# కొట్ర గ్రామంలో ఘనంగా జన్మదిన వేడుకలు

వెల్దండ మార్చి 20 (మనం న్యూస్ ) వెల్దండ మండలం కొట్ర గ్రామంలో గ్రామ సర్పంచ్ శాంపూరి శారద చెన్నయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముఖ్య నాయకులు యువకులు సన్నిహితులు అందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. తదనంతరం అందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, షాంపూరి సంధ్య జంగయ్య, కొప్పు మల్లేష్, సాయి,కాంగ్రెస్ నాయకులు కడారి శ్రీను, జనిగల మల్లయ్య, ఉడుత వెంకటయ్య, వసంతపు రాజు, షాంపూరి వెంకటయ్య, సిల్వేర్ వెంకటయ్య,మొగులాల్ యువకులు అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# రైతు బీమాకు కాంగ్రెస్ సర్కార్ రామ్ రామ్.!

**నాలుగు గంటలు తిరగకముందే నాలుక మడతేసిన కాంగ్రెస్ సర్కార్.**
**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విసుర్లు.**

వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) రాష్ట్రంలో రైతు బీమాకు కాంగ్రెస్ ప్రభుత్వం రామ్ రామ్ పలికిందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ ప్రసంగంలో అట్టహాసంగా రైతు బీమాకు ప్రత్యామ్నాయంగా కోటి 15 లక్షల కుటుంబాలకు పేద, మధ్యతరగతి, ధనిక కుటుంబాలకు సంబంధం లేకుండా ఐదు లక్షల జీవిత బీమా ఇస్తామని ప్రకటించిన నాలుగు గంటలు తిరగకముందే నాలుక మడతేసిందని కాంగ్రెస్ సర్కారుపై విసుర్లు విసిరారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు



మాత్రమే రైతు బీమా అంటూ లీకులు ఇవ్వడం ప్రభుత్వ నాటకం అన్నారు. తెలంగాణలో ఉన్న తెల్ల రేషన్ కార్డుదారు ల సంఖ్య 1,01,27,655 ఉండగా ఇందులో ఉన్న కుటుంబ సభ్యుల సంఖ్య సుమారు3.25 కోట్లు అని సర్కారు వీరందరికీ ప్రీమియం కట్టి ఐదు లక్షల బీమా వర్తింప చేస్తుందా అని ప్రశ్నించారు. రైతు భరోసా ఎగ్గొట్టిన సర్కారు, పంటల బోనస్ ఎగ్గొట్టి రైతు భీమా 40 లక్షల మందికి ప్రీమియం కట్టడానికి మొరాయిస్తున్న సర్కారు కోటి పైచిలుకు కుటుంబాలకు ప్రీమియం చెల్లిస్తుందా అని అనుమానం వ్యక్తం చేశారు. రైతు బీమాను పక్కదారి పట్టించేందుకే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పేరుతో నాటకం ఆడుతోందని విమర్శించారు. ఉదయం అందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అన్న సర్కారు సాయంత్రానికి తెల్ల రేషన్ కార్డు నిబంధన ఎందుకు పెట్టిందని ప్రశ్నించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, రైతు బీమా విషయంలో క్లారిటీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వెల్దండ మండలంలో వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష

**నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్- శ్యాం ప్రసాద్ లాల్.**





వెల్దండ మార్చి 20 (మనం న్యూస్ ) శుక్రవారం వెల్దండ మండలంలోని బొల్లంపల్లి, గుండాల, కొట్ర గ్రామాలను నాగర్ కర్నూలు జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ (స్థానిక సంస్థలు) ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. మొదట వెల్దండ గ్రామ హ్యామ్లెట్ గ్రామమైన చొక్కాన్నపల్లి గ్రామంలో రైతు రామకృష్ణ హార్టికల్చర్ క్రింద నాటిన మునగ తోటను సందర్శించడం జరిగింది. రైతుకు, ఈ జీ ఎస్ టి ఏ కు తోట నిర్వహణపై సూచనలు చేయడం జరిగింది. బొల్లంపల్లి గ్రామంలోని రైతు నిర్మించుకున్న పశువుల షెడ్ ను, మొక్కలకు పాదులు, ఫెన్సింగ్ పనులను పరిశీలించి, కూలీలతో ముచ్చటించడం, జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని పరిశీలించి వచ్చే నెలలో గృహప్రవేశం కొరకు సిద్ధంగా వుండాలని లబ్ధిదారులకు సూచనలు చేయడం జరిగింది. గుండాల గ్రామంలోని శివాలయం ఆవరణలో నిర్మించిన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ ను తనిఖీ చేసి వినియోగిస్తున్న తీరును, నిర్వహణను సర్పంచ్ ను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం కొట్ర గ్రామ పరిధిలో మహిళా రైతులు ఏర్పాటు చేసిన కూరగాయల పెంపకం షెడ్ ను పరిశీలించడం, వారికి లాభాల అర్జనకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ తో పాటు, ఆర్డిఓ చిన్న ఓబులేసు, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీ డి చంద్రశేఖర్, ఎంపీ ఓ లక్ష్మణ్, ఏపీవో ఈశ్వర్ , ఏపియం జంగయ్య , ఏపియం, సంతోష్, ఏపియం. ఈసీ దేవేందర్, టిఏ సత్యనారాయణ, అన్నపూర్ణ, వాణి, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సత్తూరి ప్రసాద్, జె శిరీష, భాస్కర్,సర్పంచులు, ఐకెపి సిసిలు, ఫీల్ అసిస్టెంట్స్ పాల్గొనడం జరిగింది.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు : మంత్రి జూపల్లి



ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 20 మనం బ్యూరో: పవిత్ర రంజాన్ పండుగ (ఈద్-ఉల్-ఫితర్) సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ పర్యాటక, సాంస్కృతిక, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత నిష్టతో, క్రమశిక్షణతో ఉపవాస దీక్షలు ముగించుకుని జరుపుకునే ఈ పండుగ సమాజంలో శాంతి, సౌభాతృత్వానికి ప్రతీక అని ఆయన కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు పంచిపెట్టాలనే 'జకాత్' విధి విధానం మానవత్వాన్ని చాటిచెబుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం భిన్నత్వంలో ఏకత్వానికి, గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి నిలయమన్నారు. ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో కలిసిమెలసి పండుగలు జరుపుకోవడం మన రాష్ట్ర విశిష్టత అని ఆయన గుర్తుచేశారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. పరమత సహనం, స్నేహభావం మరింత పటిష్టం కావాలని కోరుకుంటూ అందరికీ 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలు తెలియజేశారు.

## మొల్గరలో శుద్ధి నీటి దిశగా చర్యలు

**వాటర్ ఫిల్టర్ ప్లాంట్కు భూమిపూజ**

ఉప్పునుంతల, మార్చి 20 (మనం న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా మొల్గర గ్రామంలో కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ నిర్మాణానికి శుక్రవారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ శ్రీపురం సులోచనమ్మ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైందీ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు ఈ వాటర్



ఫిల్టర్ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడుగుల రమేష్, వార్డు సభ్యులు తప్పెట పర్వతాలు, శ్రీమతమ్మ, తహుల హైమావతి పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామ బీఆర్ఎస్ నాయకులు శ్రీపురం సుమన్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్ల గౌడు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రామంలో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ఏర్పాటుతో ప్రజలకు శుద్ధి చేసినతాగునీరుఅందుబాటులోకి రావడంతో పాటు, ఆరోగ్య సమస్యలు కూడా తగ్గే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఉప్పునుంతలలో వైద్య శిబిరం - 175 మందికి ఉచిత పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు

**వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**
**సి హెచ్ సి సూపరిండెంట్ డాక్టర్ వాణి**




ఉప్పునుంతల, మార్చి 20 (మనం న్యూస్): ప్రజలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి) సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉప్పునుంతల సిహెచ్సి వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రగతి ప్రణాళిక ఆరోగ్య మిషన్ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్నిఆమెప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.

శిబిరంలో ఆరు విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు సేవలందించారు. మాతా-శిశు సంరక్షణ, కిశోర బాలికల ఆరోగ్యం, వృద్ధుల వైద్య సేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. 14 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్పీవీవ్యాక్సిన్అందించడంతో పాటు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు.

అదేవిధంగా క్షయ వ్యాధి నిర్ధారణ, హెచ్ఐవి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అంటువ్యాధుల నివారణ, వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో మొత్తం 175 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని సిహెచ్సి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డాక్టర్ అభిలాష్, డాక్టర్ మాధవరావు, జిల్లా ఎన్సీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ కృష్ణమోహన్ పర్యవేక్షించారు. వైద్య నిపుణులుగా డాక్టర్ మెతిలాల్ (శిశు వైద్య నిపుణుడు), డాక్టర్ గజపతి (జనరల్ వైద్య నిపుణుడు), డాక్టర్ ప్రియాంక, డాక్టర్ దివ్య (కంటి వైద్య నిపుణులు), డాక్టర్ సైపోద్దీన్, డాక్టర్ ఖదీర్ పాల్గొన్నారు.కార్యక్రమంలో ఫార్మసిస్ట్ కుమారచారి, ఎంపిహెచ్ఇఓ మధు నాయక్, సూపర్వైజర్ ప్రభావతి, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు.

రైటప్పు:

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

ఉప్పునుంతల ఆసుపత్రిలో నిర్వహిస్తున్న శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్య నిపుణులు

## ఉత్సాహంగా ఉగాది వేడుకలు

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

**పంచాంగ శ్రవణంతో భక్తుల్లో నూతనోత్సాహం**



ఉప్పునుంతల, మార్చి 20 (మనం న్యూస్): పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మండల వ్యాప్తంగా భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు.వేకువజామునే లేచి స్నానమాచరించి, ఇళ్ల ముందు మామిడాకు తోరణాలు కట్టి, రంగవల్లులు వేసి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు సమీప ఆలయాలకు తరలివెళ్లారు.మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆలయం, వెల్టూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఉప్పరిపల్లి ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా శివాలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించి, బిల్వదళాలతో అర్చనలు చేసి శివుని అనుగ్రహం కోరుకున్నారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడుతూ పండుగ సందడిని తలపించాయి.

ఈ సందర్భంగా ఆలయ పురోహితులు పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని చదివి వినిపించారు. కొత్త సంవత్సర ఫలితాలు, గ్రహస్థితులు, వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులు తదితర అంశాలపై వివరించిభక్తులకుశుభాశీస్సులు అందజేశారు. పంచాంగ శ్రవణం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

గ్రామాల వారీగా ప్రజలు, యువత, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగకు మరింత శోభ చేకూర్చారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కూడా ఆలయాలకు హాజరై పూజల్లో పాల్గొని ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.మొత్తం మీద ఉప్పునుంతల మండలంలో ఉగాది పర్వదినం ఆధ్యాత్మిక వాతావరణంలో, ఆనందోత్సాహాలతో ఘనంగా జరిగింది. కొత్త సంవత్సరంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని భక్తులు ప్రార్థించారు.



## పంచాంగ పుస్తకం ఆవిష్కరించిన రావుల

**-పంచాంగ కర్తలకు రావుల ఘన సన్మానం.**

వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ప్రజల జీవన విశేషాలు తెలిపే పంచాంగం రచించడం అభినందనీయమని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర రెడ్డి అన్నారు. పరాభవ నామ ఉగాది పండుగను పురస్కరించుకొని పంచాంగ సిద్ధాంతకర్తలు మనోహర్ శర్మ, ఆయన కుమారుడు నాగరాజు శర్మ లు రచించిన పంచాంగ పుస్తకాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాంగ రచయితలను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉగాది పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో సౌభాగ్యంగా విలసిల్లాలని మనసారా కోరుకుంటున్నాను ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, పలుస శంకర్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, ఎండి. గౌస్, నందిమల్ల రమేష్, కిషోర్ కుమార్ రెడ్డి, పార్థసారథి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఆత్మగౌరవాన్ని తొక్కిపెడితే కాంగ్రెస్కు రాజకీయ సమాధి తప్పదు

**- ఎం ఎస్ ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుక్కపురం మహేష్ హెచ్చరిక**




అచ్చంపేట మార్చి 20(మనం న్యూస్): తెలంగాణ గడ్డపై 50 లక్షల జనాభా కలిగిన మాదిగ జాతిని కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ, పదవుల పంపకంలో మొండిచేయి చూపడం కాంగ్రెస్ పార్టీ నైజమా?' అని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు బుక్కపురం మహేష్ నిప్పులు చెరిగారు. శుక్రవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాలపై ఉగ్రరూపం దాల్చారు. నిన్న ప్రకటించిన నాగర్కర్నూల్ డీసీసీ జిల్లా కమిటీలో కాంగ్రెస్ పార్టీ తన కుటిల నీతిని ప్రదర్శించిందని, 32 మంది సభ్యులతో కూడిన కమిటీలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి కేవలం ఒక్కరికి మాత్రమే చోటు కల్పించడం మాదిగ జాతిని నిలువునా అవమానించడమేనని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 15 లక్షల మంది మాదిగలు ఉంటే,అధ్యక్ష పదవుల దగ్గరికి వచ్చేసరికి మాజాతి ఎందుకు కనిపించడం లేదని, ఇది ప్రజాపాలనా లేక మాదిగలను అణచివేసే పాలనా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ మహేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు అంటే మాదిగల జిల్లా డప్పులు కొట్టండి అని చెప్పిన మాటలు కేవలం మమ్మల్ని కూలీలుగా, డప్పుగాళ్లుగా చూడటానికేనా అని ప్రశ్నించారు. మాదిగలు కేవలం జెండాలు మోయడానికి, డప్పులు కొట్టడానికే పరిమితం కావాలా? మాకు నాయకత్వం వహించే అర్హత లేదా? మా రక్తంతో గెలిచిన నాయకులు ఈరోజు మాకు పదవులు ఇవ్వడానికి ఎందుకు వెనకాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. నాగర్కర్నూల్ జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగానే మాదిగ నాయకత్వాన్ని ఎదగనీయకుండా తొక్కి పెడుతున్నారని, రాజకీయ వివక్షను ప్రదర్శిస్తూ అగ్రవర్ణాల కబంధ హస్తాల్లో పార్టీని ఉంచి సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కూడా మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

తక్షణమే నాగర్కర్నూల్ డీసీసీ కమిటీని రద్దు చేసి, జనాభా ప్రాతిపదికన మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలని మహేష్ డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాల్లో మాదిగ నాయకులను జిల్లా అధ్యక్షులుగా నియమించాలని, జనాభాకు అనుగుణంగా పార్టీ పదవులు మరియు ఎన్నికల అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. లోక్సభ, రాజ్యసభల్లో కూడా మాదిగలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని, దేశవ్యాప్తంగా సమాన ప్రాతినిధ్యం గురించి మాట్లాడే మాటలు ఇక్కడ కూడా అమలు కావాలని సూచించారు. మాదిగ జాతి ఆత్మగౌరవంతో ఆటలాడుకోవద్దు, మీరు వేసే ఎంగిలి మెతుకుల కోసం మేం ఎదురుచూడటం లేదు, మా హక్కును మేం అడుగుతున్నాం. కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకోకపోతే అచ్చంపేట గడ్డ నుంచి మొదలయ్యే ఈ నిరసన జ్వాల రాష్ట్రవ్యాప్తంగా వ్యాపిస్తుంది. మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ రాజకీయ సమాధి కాక తప్పదు అని బుక్కపురం మహేష్ ఈ సందర్భంగా గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ విద్యార్థులు బరపటి రంజిత్, అలెటి అజాయ్,ఎలుగులేటి కృష్ణ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో పనిచేస్తా

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ): మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ శాసనసభలో ప్రభుత్వ విప్గా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎమ్మెల్యే క్వార్టర్స్లో, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్లో కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, శాసనసభలో పార్టీ వ్యవహారాల సమన్వయం, సభ్యుల మధ్య క్రమశిక్షణ పరిరక్షణ వంటి అంశాలపై సవివరంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ విప్గా తనకు వచ్చిన బాధ్యత ఒక పదవిగా మాత్రమే కాకుండా ప్రజల పట్ల, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను మరింతగా పెంచే సదవకాశం అని అన్నారు. శాసనసభలో పార్టీ విధానాలను సమర్థంగా అమలు చేయడంలో, ప్రభుత్వ నిర్ణయాలను సభ్యులకు చేరవేయడంలో, అలాగే ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో తాను కీలక పాత్ర పోషిస్తానని తెలిపారు. ప్రత్యేకంగా మహబూబ్నగర్ నియోజకవర్గ



అభివృద్ధిపై దృష్టి సారిస్తూ, పలు మౌలిక వసతుల అభివృద్ధి, పేదల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో మరింత వేగంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కోసం కృషి చేస్తానని, శాసనసభలో పార్టీ తరఫున సమర్థవంతంగా వ్యవహరిస్తూ సభ్యుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజలకు ఉపయోగపడేలా తన వంతు పాత్ర పోషిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ మండలిలో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ శాసనసభ ప్రభుత్వ విప్ లు వేముల వీరేశం, విజయ రామణారావు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# మతసామరస్యానికి ప్రతీక పండుగలు - 40వ డివిజన్ కార్పొరేటర్ సీబీ పూజిత

**సొంత ఖర్చులతో నిరుపేదలకు ముస్లింలకు రంజాన్ ప్యాకేజీల పంపిణీ**



మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ): నిరుపేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని 40వ డివిజన్ కార్పొరేటర్ సీబీ శ్రీపూజిత అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ సీబీ పూజిత తన సొంత ఖర్చులతో డివిజన్ లోని నిరుపేద ముస్లింలకు గురువారం రంజాన్ ప్యాకేజీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవ పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. కులమతాలకతీతంగా డివిజన్ లోని ప్రజలకు తనవంతు సహాయం అందజేస్తానని తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకలుగా పండుగలు నిలుస్తాయని అన్నారు. రంజాన్ మాసంలో నిరుపేద ముస్లింలకు తనవంతు రంజాన్ ప్యాకేజీలు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో డివిజన్ ను అన్ని విధాలంగా అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్ తీర్చిదిద్దుతామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. సొంత ఖర్చులతో రంజాన్ ప్యాకేజీలు పంపిణీ చేసిన కార్పొరేటర్ సీబీ శ్రీపూజితను డివిజన్ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, సన్నీ రాజ్, తేజ, సోనీ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ

**ఊరుకొండ పేట సర్పంచ్ అబ్దుల్ రషీద్.**



ఊరుకొండ మార్చి 20 (మనం న్యూస్): స్థానిక మండల పరిధిలోని కొరుకొండ పేట గ్రామపంచాయతీలో శుక్రవారం అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగింది.ఈ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన పథకమే తోఫా కార్యక్రమమని, స్థానిక సర్పంచ్ అబ్దుల్ రషీద్ పేర్కొనడం జరిగింది.పేద ముస్లిం మైనార్టీలు ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, గడిచిన రెండేళ్లుగా రంజాన్ తోఫా ఇవ్వకుండా పేద ముస్లిం వర్గాలను నిరాశపరచిన గత ప్రభుత్వం,నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలను దృష్టిలో ఉంచుకొని మధ్యతరగతి కుటుంబాలు, ఆనందంగా రంజాన్ పండుగ చేసుకోవాలని ఉద్దేశంతో,మైనార్టీ సంక్షేమం కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కొనియాడారు.ఈ కార్యక్రమం ద్వారా సామాజిక,సమైక్యతను ప్రోత్సహించే విధంగా, ప్రతి ఒక్కరు ఓర్పు, సహనం,సత్ప్రవర్తనతో,మెలగాలన్నదే రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశం అన్నారు. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాల అమలు చేస్తుందని వాటిని సద్వినియోగపరుచుకోవాలని నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ సమీ తెలియపరచాడు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు,మైనార్టీ పాలకవర్గ సభ్యులు, పాల్గొనడం జరిగింది.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**- ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో రూ.3,000 అందజేత**

కల్వకుర్తి రూరల్ ,మార్చి 20 (మనం న్యూస్): కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన బొంగం మొగులయ్య అనారోగ్యంతో గత వారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి శుక్రవారం నాడు తన వంతు సహకారంగా రూ.3,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సహాయాన్ని దారమోని గణేష్ ద్వారా మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ... మొగులయ్య కుటుంబానికి తాము అండగా ఉంటామని, ముఖ్యంగా వారి పెద్ద కుమారుడి చదువుకు అవసరమైన సహాయం ఉప్పల ట్రస్టు ద్వారా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ వార్డు సభ్యులు ఖాజా, రోడ్డ ప్రభాకర్, ముచ్చింతల వెంకటయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి కాంపల్లి వెంకటయ్య, రామస్వామి, హనుమకొండ సత్యం, ఆంధ్రయ్య, నాని, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సంబరాలు

రేవల్లి మార్చి 20-03-2026 మనం న్యూస్ : ఉగాది పండుగను పురస్కరించుకుని చెన్నారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎద్దుల బండ లాగుడు, గిరుక పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

బండ లాగుడు పోటీల్లో గోపాల్పేట్ గ్రామానికి చెందిన ఉంద్యాల విష్ణు గారి ఎద్దులు 4500 అడుగులతో మొదటి స్థానం సాధించగా, నాగిరెడ్డి గారి ఎద్దులు రెండవ స్థానం, రామచంద్రయ్య గారి ఎద్దులు మూడవ స్థానం, పెద్ద బాలయ్య గారి ఎద్దులు నాలుగవ స్థానం దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# పవిత్ర మాసం.. పాఠశాల వేడుకల హర్షం

**శ్రీ వెంకట బాల రామయ్య పాఠశాల కరస్పాండెంట్ సామల బాలరాజ్.**



ఊరుకొండ మార్చ్ 20 (మన న్యూస్).: ఊరుకొండ మండలం ప్రైవేట్ స్థానిక పాఠశాలలో శుక్రవారం రంజాన్ వేడుకలు ముందుగానే అట్టహాసంగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ వెంకట బలరామయ్య పాఠశాల కరస్పాండెంట్ సామల బాలరాజు మాట్లాడుతూ,రంజాన్ పవిత్ర మాసం ఆధ్యాత్మిక చింతనకు ప్రతీక,మతసామరస్యం, విద్యార్థుల ఉత్సాహం, సాంస్కృతిక కార్యక్రమాలతో కూడిన, భిన్నత్వంలో ఏకత్వమైన పండుగని,రంజాన్ కేవలం ఉపవాసాల నిలయం మాత్రమే కాదు.అది ఆత్మీయతలను పెంచే పవిత్ర మాసం.ప్రతి సంవత్సరం లాగే,ఈ ఏడాది కూడా రంజాన్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాఠశాలలో ఉత్సాహంగా ప్రారంభొ చేసుకున్నారు.పాఠశాల ఆవరణం రంజాన్ నెలవంక తో కలకలలాడుతోంది. విద్యార్థులందరూ రంగు రంగుల సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు.ఉదయం ప్రత్యేక అసెంబ్లీలో రంజాన్ ప్రాముఖ్యత వివరిస్తూ పరస్పరం 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలు ఒకరికి ఒకరు తెలుపకోవడం జరిగింది. రంజాన్ వేడుకల్లో విద్యార్థులందరూ మతాలకతీతంగా పాలుపంచుకోవడం విశేషమని కొనియాడుతూ, హిందూ,ముస్లిం, క్రైస్తవులు,కలిసి సోదర భావంతో రంజాన్ పండుగ సంతోషాన్ని పంచుకున్నారు.స్థానిక శ్రీ వెంకట బాలరామయ్య ప్రైవేట్ పాఠశాల 'భిన్నత్వంలో ఏకత్వం కు అద్దం పడుతుందని ' దానికి ఇదే నిదర్శనం అని,రంజాన్ ఉపవాస దీక్షలు చేసిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు,సేమియా,ఖర్జూరాలను, విద్యార్థులకు ఉపాధ్యాయులకు పంచటం,రంజాన్ పాటలు నృత్యాలు నిర్వహించడం ద్వారా పాఠశాల వాతావరణం పండుగలు మారిందని, రంజాన్ కవిత్వం ఉపవాసాల విశిష్టతపై చిన్నారుల ప్రసంగాలు వీక్షకులకు మంత్రముగ్ధులుగా తిలకించారు.రంజాన్ పండుగ స్నేహాన్ని పంచుకోవటాన్ని, కరుణకు ప్రతిరూపమని,ఈ వేడుకలు విద్యార్థులలో ప్రేమ ఆత్మీయతలను పెంపొందించడంలో విజయం సాధించాలని అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జార్జ్ జోసఫ్,వైస్ ప్రిన్సిపల్ రామ్ పెరుమాండ్ల,సీనియర్ ఉపాధ్యాయుని శ్రీదేవి, కీర్తి రెడ్డి,మౌనిక, నందిని,విశ్వనంద్ విద్యార్థులు,తరగతి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర బృందం,పాల్గొనడం జరిగింది.

# రంజాన్ ఇఫ్తార్ ఆత్మీయ సమ్మేళనం

**సౌభ్రాతృత్వ సౌరభం పంచాయతీ ఇఫ్తార్ వేడుకల వైభవం. రాచాలపల్లి సర్పంచ్ మాడుగుల మహేష్.**





ఊరుకొండ మార్చి 20 (మనం న్యూస్): ఊరుకొండ మండల పరిధిలోని శుక్రవారం రాచాలపల్లి గ్రామంలో నూతనంగా కొలువుధీరిన గ్రామ పాలకవర్గం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మిత్రులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన సందర్భంగా,స్థానిక సర్పంచ్ మాడుగుల మహేష్ ప్రత్యేకంగా పాల్గొని గ్రామ చరిత్రలో ఒక మరుపురాని సంఘటన.ఉపవాస దీక్షలు (రోజా) చేపట్టిన ముస్లింలకు ఆత్మీయ సమ్మేళనం ఆతిథ్యం ఇవ్వడం ద్వారా గ్రామంలో పాలకవర్గ సభ్యుల సహకారంతో సోదర భావాన్ని పరస్పరం గౌరవించుకోవచ్చని కొనియాడారు.ఇఫ్తార్ విందు కేవలం భోజనం మాత్రమే కాదు, కుల మతాల హద్దులను చెరిపివేసి,అందరిని ఒక్కటి చేసే గొప్ప వేదికని,మసీదు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులంతా కలసి ఉపవాస విరమణలో పాలపంచుకోవడం విశేషమని తెలియజేశారు.రంజాన్ మాసం అంటే దాన,ధర్మాలో ప్రేమ,సహనం,ముస్లిం సోదరుల దైవ ప్రార్థనలకు దీక్షలకు గౌరవం ఇస్తూ, గ్రామపంచాయతీ ఇంతటి గొప్ప ఆత్మీయ విందును ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులందరి తరపున పాలకవర్గానికి అభినందనలు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామంలో పాత విభేదాలను తొలగించి ఆత్మీయ అనుబంధాలను బలపరుస్తాయని, మహమ్మద్ శంషాద్దీన్ తన అభిప్రాయం వెలుబుచ్చారు. 'వసుదైవక కుటుంబం' అనే భావనతో అందరిని సమానంగా చూస్తూ, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఇటువంటి మతాలకతీతంగా చేస్తున్న పండగలు పల్లెల్లో ఐక్యతను చాటి చెప్పడంలో నిరీపుతమవుతుందని,ఈ రంజాన్ పండుగ గ్రామస్తులందరికీ శాంతి,సౌభాగ్యాలను తీసుకురావాలని ఆశిద్దాం అంటూ,స్థానిక ఆఫీజ్ ఇర్ఫాన్ తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటస్వామి, గంగాపురం సుదర్శన్ రెడ్డి,జే,అమరేష్ రెడ్డి,జే అరుణ్ రెడ్డి,మజీద్ పాలకమండలి సభ్యులు,గ్రామస్తులు పాల్గొనడం జరిగింది..

# పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**- వచ్చే బోనాల పండుగ నాటికి ఆలయం పూర్తి చేయాలి**
**- తాండ్ర గ్రామ సర్పంచ్ - ఆశాదీప్ రెడ్డి**

కల్వకుర్తి రూరల్ , మార్చి 20 (మనం న్యూస్)

కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పెద్దమ్మ తల్లి దేవాలయానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మాణం గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.గ్రామస్థుల సహకారంతో ఆలయ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి వచ్చే బోనాల పండుగ నాటికి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు బాల్ రెడ్డి ,

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, విజయ్ ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు హరీష్ యాదవ్ మల్లేష్ గౌడ్ ఆనందు ఈదమయ్యా ,రామస్వామి, గ్రామ పెద్దలు వెంకటయ్య ,కిష్టయ్య చంద్రయ్య ,దుర్గేష్ ,కృష్ణయ్య మల్లేష్ ,రాజు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18,000/-ల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలి

**ఇతర సమస్యల పరిష్కారం కోసం సరిపడా నిధులు కేటాయించాలి. జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పారితోషికాలు వెంటనే చెల్లించాలి. కళావతి : ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు**



నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటిని ముట్టడి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆశ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కళావతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వర్ధా పర్వతాలు మాట్లాడుతూ :

తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు. వీరంతా మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులున్నారు. నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం గ్యారెంటీ ఫిక్సిడ్ వేతనం కూడా ఇప్పటివరకు నిర్ణయం చేయలేదు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ఈ కాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అయినా నేటికి వేతనాలు పెంచలేదు. 50 లక్షల ఇన్సూరెన్స్, 50వేల మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినా, ఇంకా అమలు చేయటం లేదు. పి.ఆర్.సి. ఎరియర్స్, లెప్రసీ, పల్సపోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉంటున్నాయి. వీటికి తోడు పారితోషికాలు కూడా ప్రతి నెలా రావటం లేదు. దీంతో ఆశా వర్కర్లు అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంకా అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయి. వీటన్నింటినీ పరిష్కరించే విధంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ్రాఏకకు నిధులు పెంచాలని ఆశా వర్కర్లు కోరుతున్నారు. అదేవిధంగా డిమాండ్లు1. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18,000/-ల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని. ఇతర సమస్యలు పరిష్కరించే విధంగా ఎన్ హెచ్ ఎం కు సరిపడా నిధులు కేటాయించాలని.2. జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పారితోషికాలు వెంటనే చెల్లించాలని .3. ఆశాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500/-ల పారితోషికాలను వెంటనే అమలు చేయాలి.4. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పి.ఆర్.సి. ఎరియర్స్ వెంటనే చెల్లించాలని .5. 2022 నుండి 2025 వరకు నాలుగు సంవత్సరాల లెప్రసీ సర్వే డబ్బులు, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ పెండింగ్ డబ్బులు చెల్లించాలి. అదేవిధంగా ఎగ్జామ్ డ్యూటీలకు డబ్బులు చెల్లించాలని .6. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 50 లక్షల ఇన్సూరెన్స్, 50వేల మట్టి ఖర్చులకు వెంటనే జి.ఓ. లు ఇవ్వాలని.7. పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ.. సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని .8. ఎ.ఎన్.ఎం. జి.ఎన్.ఎం. ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశా వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం వెంటనే నిర్ణయించాలని .9. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆదివారం మరియు పండుగలకు సెలవులు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని .10. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎ.ఎస్.సి., పి.ఎన్.సి. తదితర టార్గెట్స్ ను రద్దు చేస్తూ సర్క్యులర్ జారీ చేయాలని .11. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలి. ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని .12. సంవత్సరానికి 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు, 6 నెలలు వేతనంతో కూడిన మెడికల్ సెలవులివ్వాలని .13. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని .14. ఆశాలతో ఎన్ సి డి ఆన్లైన్ పని చేయించకూడదని. అదేవిధంగా స్పూటమ్ డబ్బాలు మోయించకూడదని.15. పూనమ్ క్లాత్ తో కూడిన క్వాలిటీ యూనిఫాం సప్లై చేయాలని .16. ఆశాలు చేస్తున్న పారితోషికం లేని పనులన్నింటిని గుర్తించాలని .17. ప్రభుత్వ అన్ని ఆస్పత్రుల్లో ఆశాలకు ప్రత్యేకంగా రెస్టు రూమ్లు ఏర్పాటు చేయాలని .18. ఆశాలకు పనిభారం తగ్గించాలని . పారితోషికం లేని పనులు చేయించకూడదని .19. ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఆశ యూనియన్ నాయకులు సునీత, బిచ్చమ్మ, గిరిజ, గద్వాల జిల్లా నాయకురాలు సునీత, పద్మ, సరస్వతి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, ఉపాధ్యక్షులు శ్రీదేవి, నాయకురాలు శివలీల, చెన్నమ్మ, గౌరమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతికి బాటలు వేసేలా రాష్ట్ర బడ్జెట్

**డి సి సి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్**

మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన్న 3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ఒక ప్రజా బడ్జెట్ గా ఉందని శుక్రవారం డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు.ఆయన మాట్లాడుతు ఈ బడ్జెట్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని రైతాంగానికి, పేదలకు మరియ ఉద్యోగులకు కొండంత అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇది ఇందిరమ్మ రాజ్యానికి అసలైన పునాది. కేవలం అంకెలు మాత్రమే కాదు, సామాన్యుడి ఆశలను ప్రతిబింబించే బడ్జెట్ అన్నారు . జూన్ 2 నుంచి అమలు కానున్న 5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం జిల్లాలోని లక్షలాది నిరుపేద కుటుంబాలకు భరోసానిస్తుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు మన జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్లో ప్రాధాన్యతనివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం నగదు రహిత వైద్యం మరియు 1.20 కోట్ల ప్రమాద బీమా కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు.



**విద్యారంగం లో..**

జిల్లాలో ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందుతుందన్నారు.

**రైతు భరోసా:**

రైతు రుణమాఫీతో పాటు సాగునీటి రంగానికి, విద్యుత్ సబ్సిడీలకు భారీ కేటాయింపులు చేయడం రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతుందన్నారు.గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిన తెలంగాణను, కాంగ్రెస్ ప్రభుత్వం క్రమశిక్షణతో కూడిన ఆర్థిక విధానాలతో మళ్లీ పట్టాలెక్కిస్తోందని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.



## గ్యారెంటీలు అమలు చేయాలంటూ బీజేపీ ఆందోళన

రేవల్లి మార్చి 20-03-2026 మనం న్యూస్ : రాష్ట్ర పార్టీ సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ గారి అధ్యక్షతన, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని 6 గ్యారెంటీలు మరియు రైతుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఈరోజు ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని ఎంఆర్వో కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు కె. రాము యాదవ్ గారి ఆధ్వర్యంలో ఎంఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎద్దుల బండ్ల గిరుక పోటీలు.. విజేతలకు బహుమతులు



రేవల్లి మార్చి 20-03-2026 మనం న్యూస్ : టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంబరాల్లో భాగంగా ఎద్దుల బండ్ల గిరుక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ సందర్భంగా గుంటి వెంకటయ్య గారి ఎద్దులు 2984 అడుగుల దూరం ప్రయాణించి మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, బెట్టరి రాములు గారి ఎద్దులు 2924 అడుగుల దూరంతో రెండవ స్థానాన్ని సాధించాయి. గుంటి చిన్న రాములు గారి ఎద్దులు 2588 అడుగుల దూరంతో మూడవ బహుమతిని గెలుచుకున్నాయి.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు మరియు రైతులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

## నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా యెన్నం భూపతిరెడ్డి నియామకం

వెల్దండ మార్చి 20 (మనం న్యూస్ ) నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా వెల్దండ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అయినటువంటి ఎన్నం భూపతిరెడ్డి ని నియమించినట్లు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నం భూపతి రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను నియమించినందుకు ప్రత్యేకంగా ఎమ్మెల్యేకు వారితోపాటు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపినట్లు తెలియజేశారు.





## శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదిన వేడుకలు

వెల్దండ మార్చి 20 (మనం న్యూస్ ) వెల్దండ మండలం కొట్ర గ్రామంలో శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయంలో గురువారం పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా సాయంత్రం గ్రామ సర్పంచ్ శాంపూరి శారద చెన్నయ్య ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించి అనంతరం అర్చకులచే పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు యువకులు అందరూ పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో పాల్గొని ఉగాది పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.

## మున్సిపల్ ఎన్నికలు ముగిసినా!

**విగ్రహాల ముసుగులు తొలగించే నాధుడే లేరా..?**

**మాజీ సిఎం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ముసుగు తొలగించని మున్సిపల్ అధికార యంత్రాంగం...**



కల్వకుర్తి రూరల్, మార్చి 20 (మనం న్యూస్): కల్వకుర్తి పట్టణ కేంద్రం నడిబొడ్డులో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ముసుకు వేశారు...! ఆ ముసుగు ను తొలగించడంలో సంబంధిత మున్సిపల్ శాఖ అధికారుల తప్పిదం ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారి మార్గం వెంట రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఉంది. గత నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పట్టణంలోని పలువురు రాజకీయ నాయకుల విగ్రహాల కు మున్సిపల్ సిబ్బంది ముసుగులు తొడిగారు. అయితే ఎన్నికల ప్రక్రియ పూర్తై, కోడ్ ముగిసినప్పటికీ కొన్ని విగ్రహాలపై ఉన్న ముసుగులు ఇప్పటికీ తొలగించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో రాజకీయ ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో విగ్రహాల కు ముసుగులు వేయడం సాధారణ ప్రక్రియ కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా వాటిని అలాగే ఉంచడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు.ఈ విషయంపై స్థానికులు మరియు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు స్పందిస్తూ....ఎన్నికలు ముగిసిన వెంటనే ముసుగులు తొలగించి విగ్రహాలను యథాస్థితికి తీసుకురావాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేనని అంటున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పట్టణంలోని విగ్రహాలపై ఉన్న ముసుగులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# లిరిక్ రైస్ మిల్ ఆస్తుల జప్తు

**-చరాస్తుల విలువ సుమారు 6.06 కోట్లు.**
**-ప్రభుత్వానికి 31 కోట్లు బకాయి పడ్డట్లు నిర్ధారణ.**
**-హైకోర్ట్ ఆదేశాలతో రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చరాస్తుల జప్తు.**
**-తహసిల్దార్ రమేష్ రెడ్డి.**





వనపర్తి మార్చి 20 (మనం ప్రతినిధి) వనపర్తి మండలం నాచహళ్లి గ్రామ సమీపంలో గల లిరిక్ రైస్ మిల్ కు చెందిన 6.06 కోట్ల విలువైన చరాస్తులను జప్తు చేసినట్లు తహసిల్దార్ రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 రబి సీజన్ కు సంబంధించిన ధాన్యం నిల్వలను తమ ప్రయోజనాల కోసం వినియోగించుకొని ప్రభుత్వానికి ఇవ్వాల్సిన 1089.288 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మర ఆడించి ప్రభుత్వానికి ఇవ్వగా మిగిలిన ధాన్యం 14076.746 మెట్రిక్ టన్నుల దాన్యం యందు ఉండాల్సి ఉండగా 3563.760 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని తెలిపారు. డిఫాల్ట్ ధాన్యం మీద ఎఫ్ఐఆర్ 163/2024 వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు హైకోర్టు ఆదేశాల ప్రకారం 10310.091 మెట్రిక్ టన్నుల వడ్ల బకాయిలకు 31 కోట్లు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత మిల్లుకు పలుమార్లు నోటీసులు జారీ చేసి బకాయిలను చెల్లించాలని కోరినప్పటికీ వారు బకాయిలను చెల్లించకుండా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. కోర్టులో కేసు ఉందన్న నెపంతో బకాయిలు చెల్లించకుండా సాగదీస్తున్నారని తెలిపారు. రైస్ మిల్లుల బకాయిల విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల మంత్రి బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆదేశించినప్పటికీ సంబంధిత మిల్లర్ చెల్లింపులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అందుకు సంబంధిత మిల్లులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా కలెక్టర్ సూచన మేరకు శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి మిల్లును తనిఖీ చేసి జప్తు చేయడం జరిగిందన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**ఇన్చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



మహబూబ్ నగర్, 20మార్చి, (మనం ప్రతినిధి ) : మహబూబ్నగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట్ ఉపేందర్ రెడ్డి తో కలిసి అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు), డిప్యూటీ ఇంజినీర్లు , హౌసింగ్ శాఖ అధికారులతో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామాన్ని క్రమం తప్పకుండా ఇంజనీర్లు సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని, రోజువారీ నివేదికలు సమర్పించాలని సూచించారు. ఎక్కడైనా నిర్మాణ పనులు ఆగిపోయి ఉంటే, ఏఈ లు లబ్ధిదారులను కలిసి వారిని చైతన్యపరచి, అలాగే మేస్త్రీలతో సమావేశం నిర్వహించి నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో మొత్తం 10,555 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో 7,898 ఇళ్లు మార్కింగ్ చేయబడ్డాయి. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని గృహ నిర్మాణ అధికారులు వివరించారు.మిగిలినవి ఇందిరమ్మ కమిటీ ల ద్వారా లబ్ధిదారులు వెంటనే గ్రౌండింగ్ చేసుకునేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.స్లాబ్ స్థాయికి చేరుకున్న ఇళ్ల పనులు ఆలస్యం ఎందుకు అవుతున్నాయని అదనపు కలెక్టర్ ఏఈ లను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు, మేస్త్రీలు, కార్మికులతో సమావేశాలు నిర్వహించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇసుక లేదా ఇతర నిర్మాణ సామగ్రి కొరత ఉంటే వెంటనే పరిష్కరించాలని, రెవెన్యూ శాఖ ద్వారా ఇసుక సరఫరా సులభతరం చేస్తామని తెలిపారు.

ఇందుకు సంబంధిత తహసీల్దార్లకు తగిన సూచనలు ఇవ్వనున్నట్లు చెప్పారు.ప్రతి ఇందిరమ్మ ఇల్లు రూ.5 లక్షల వ్యయం కంటే ఎక్కువ కాకుండా ఇంటి నిర్మాణ ప్రణాళికను ఇంజనీర్లు మేస్త్రీలకు సూచించాలని, వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కలిగించాలని సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారం లో కనీసం 1,300 ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టారు. అలాగే జూన్ 2 నాటికి మిగిలిన ఇళ్లు పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించాలని సూచించారు.ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మహబూబ్నగర్ జిల్లా రాష్ట్రంలో 21వ స్థానంలో ఉందని, జూన్ 2 నాటికి టాప్ 5 లోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇకపై ప్రతి రోజు ఏఈలు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి పురోగతిని పర్యవేక్షిస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట ఉపేందర్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

**సర్పంచ్ -మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**



వెల్దండ మార్చి 20 (మనం న్యూస్ )కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా వెల్దండ మండల కేంద్రానికి చెందిన గోరటి నాగమ్మ కు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇండ్లు లేని నిరుపేదల పాలిట ఒక గొప్ప వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను, వార్డు సభ్యులు ముదిగొండ కవిత రమేష్, శేఖర్, నాయకులు కొయ్యాల పుల్లయ్య, పురుషోత్తం చారి, ఆనంద్, శ్రీనివాస్, మట్ట భరత్ గౌడ్, కొండల్ ,తదితరులు ఉన్నారు.